

గోణికాపుత్రుడు కనిపించాడు. రతిమంజరి తలుపు తీసిన కొద్దిసేపటికే అతను నిద్ర లేచాడు.

రతిమంజరి చిరునవ్వుతో అతని వద్దకు వెళ్లి..

''మహాత్మా! నాపేరు రతిమంజరి. నేనొక వేశ్యకూతురిని. కానీ కులవృత్తిని చేపట్టలేదు. ఇంతవరకూ పురుష సాంగత్యం ఎరుగను. పెళ్లి చేసుకుని, ఇల్లాలిగా మారాలని నా నిర్ణయం. అందుకు తగిన ఉపాయం బోధించమని, నేనొక గురువును ఆశ్రయించాను. ఆయన ఈనాటి ఉదయం ముహూర్తం నిర్ణయించాడు. 'ఈవేళ మునుముందుగా ఏ పురుషుడు నీ దృష్టిని ఆకర్షిస్తాడో అతని మెడలో వరమాల వేయి' అని నిర్దేశించాడు. మీరు రూపానికి మరో మన్మథునిలా ఉన్నారు. ఉన్నత కులానికి చెందినవారని, బాగా చదువుకున్నారని మీ ముఖవర్చస్సు చూస్తుంటేనే బోధపడుతున్నది. మీరు అనుమతిస్తే ఈ వరమాల మీ మెడలో వేస్తాను'' అన్నది.

గోణికాపుత్రుడు తబ్బిబ్బయ్యాడు.

''నీలాంటి అన్నులమిన్న వలచి వస్తుంటే కాదనే మూర్ఖుడు ఎవడు ఉంటాడు? కానీ, నీవంటి వేశ్యాపుత్రికను, అందులోనూ ఒక అపరిచితురాలిని ఉన్నపాటున భార్యగా వరించాలంటే.. కాస్త ఆలోచించుకోవాలి కదా!!'' అన్నాడు.

''మహాత్మా! దయచేసి లోనికి రండి'' అంటూ చేయి పట్టుకుని ఇంటిలోపలికి తీసుకెళ్లింది రతిమంజరి. తన అక్కకు పరిచయం చేసింది.

మాటల మధ్యలో తన ప్రాణస్నేహితుడైన దత్తకుణ్ని ఆ అక్కచెల్లెళ్లలో పెద్దదైన చిత్రసేన వరించిందని తెలిసింది.

''మహాత్మా! మేము కూడా మీతోపాటు ధారానగరానికి వస్తాం. ఇక్కడే ఉంటే మా తల్లి మమ్మల్ని బతకనివ్వదు. మమ్మల్ని మీతోపాటు తీసుకెళ్తే మేము మీకు సేవలు చేస్తాం'' అని కోరారు అక్కచెల్లెళ్లు.

అంతా నిర్ణయమైపోయింది. చిత్రసేన, రతిమంజరి ఇద్దరూ తల్లినుంచి ఒక్కపైసా కూడా తీసుకోలేదు.

చివరికి ఆమె ఇచ్చిన దుస్తులను కూడా ఆమెకే విడిచిపెట్టేశారు. గోణికాపుత్రుడు వారికి పురుష వేషాలు వేయించాడు. ముగ్గురూ కలిసి ఆనాడే ఇల్లు వదిలి వెళ్లిపోయారు.

తల్లి అయిన రతినూపుర వీధి అరుగుమీద కూర్చుని, నెత్తీనోరూ బాదుకుంటూ విలపించసాగింది.

సరిగ్గా అదే సమయంలో అక్కడికి కాషాయ వస్త్రాలను ధరించి, ఒళ్లంతా విబూది పూసుకున్న సిద్ధురాలు ఒకరు చేతిలో దండంతో వచ్చి, రతినూపుర ఎదుట నిలబడింది.

ఆమెను చూడగానే రతినూపుర అరుగు దిగి వచ్చి..

''తల్లీ! నా కూతుళ్లిద్దరూ నన్ను విడిచిపెట్టి వెళ్లిపోయారు. నేటితో నా ఐశ్వర్యం మొత్తం హరించుకుపోయింది. నా బతుకు నాశనమైపోయింది'' అని ఆమె పాదాలపై పడి ఏడవసాగింది.

''ఆ పిచ్చి ఏడుపు మాని, అసలేం జరిగిందో చెప్పు'' అని కసురుకుంది యోగిని.

రతినూపుర చిత్రవిచిత్రంగా పలురీతుల్లో ఏడుస్తూ జరిగినదంతా వివరించింది.

అంతా విన్న తరువాత యోగిని నిట్టూరుస్తూ..

''నేనిప్పుడు నీ కూతుళ్లను చక్రవర్తికి భార్యలను చేయాలని వచ్చాను. నారాక నిష్ఫలమైపోయింది. మహాపుర నగరాధీశ్వరుడైన విపులుడనే మహారాజు నవరస రసికుడు. గొప్ప తేజశ్శాలి. రూపంలో మన్మథుడే! నేను అతని వద్ద ఆరుమాసాలు ఉన్నాను. ఒకసారి అతను స్త్రీ ప్రశంస మీద, 'దేవీ! నువ్వు సర్వదేశాలూ తిరిగినదానవు కదా! ఇందువదనలు కుందరదనలని కవులు వర్ణించేలాంటి అందగత్తెలను ఎక్కడైనా చూశావా?!' అని అడిగాడు. అప్పుడు నేనతనికి నీ కూతుళ్ల గురించి చెప్పాను. నేను వర్ణించిన విధానంతో అతనికి పిచ్చెక్కిపోయింది. ఎలాగైనా నీ కూతుళ్లనే పెళ్లి చేసుకుంటానని కూర్చున్నాడు. ఇప్పుడతనికి నేనేమని చెప్పను?'' అన్నది.

''ఏమో తల్లీ! నీ దయవుంటే నా కూతుళ్లకు ఆ బడుగుబాపడితో బతికే దౌర్భాగ్యం పోతుంది. హాయిగా చక్రవర్తి పంచన చేరగలరు. అన్నట్లు వాళ్లు ముగ్గురూ పురుష వేషాల్లో ఉన్నారు. నువ్వు తొందరగా ఈ దారిలో వెళ్తే కనిపెట్టగలవు'' అన్నది రతినూపుర.

''సరే.. నేను చూస్తానులే'' అంటూ యోగిని అక్కణ్నుంచి కదిలింది.

ఆ యోగిని గొప్ప తెలివైనది. గోణికాపుత్రుడు, రతినూపుర కూతుళ్లు వెళ్తున్న దిక్కుకే తానూ వెళ్లి వాళ్ల ఆనుపానులు తేలికగా తెలుసుకోసాగింది.

పాటలీపుత్రం దాటిన తరువాత ఒక గ్రామంలో గోణికాపుత్రునితో మాట కలిపింది. అతనితోపాటు వారి బసకు వెళ్లింది. చిత్రసేన, రతిమంజరి ఆ యోగినిని గుర్తించారు. కానీ, ఆమె వారిని గుర్తించనట్లే నటించింది.

ఆమె లేని సమయంలో అక్కచెల్లెళ్లిద్దరూ గోణికాపుత్రునితో..

''ఈ యోగిని మా అమ్మ వద్దకు వస్తుండేది. మమ్మల్ని వెనక్కు తీసుకుపోవడానికే ఇక్కడికి వచ్చి ఉంటుంది'' అని చెప్పేశారు.

దాంతో ఆరాత్రి ఆమె కంటపడకుండా ఆ గ్రామం నుంచి రహస్యంగా ముగ్గురూ వెళ్లిపోయారు. తెల్లవారిన తరువాత జరిగిన మోసం గ్రహించింది యోగిని.

పదిరోజులపాటు ఏకబిగిన ప్రయాణం చేస్తూ వేరొక గ్రామంలో వారిని కలుసుకుంది.

''అమ్మాయిలూ! నేను మిమ్మల్ని గుర్తించాను. మీకు ఈ బాపనాయనతో పొత్తేమిటి? మిమ్మల్ని నేను చక్రవర్తి భార్యలను చేస్తాను. మీకు గొప్ప రాజ్యమే రానున్నది. నాతో రండి'' అని ఉపదేశించింది.

ఆమె మాటలు విని చిత్రసేన ఏవగించుకుంది.

''ఓసీ! ఇదా నీ వేదాంతం?! యోగినిలా వేషం వేసుకుని, ఆ రాజుకు తార్పుడుకత్తెగా పని చేస్తున్నావా?!'' అని ఈసడించింది.

''ఇక్కణ్నుంచి పోతావా.. గ్రామస్తులతో చెప్పి తన్నించమన్నావా?!'' అని రతిమంజరి బెదిరించింది.

ఆ యోగిని అప్పటికి వెళ్లిపోయింది. కానీ, దురదృష్టం కొద్దీ వారు వెళ్తున్న మార్గం విపులుని రాజ్యంలోనే ఉంది. దానిని అవకాశంగా తీసుకుని, యోగిని తన రాజునుంచి ఒక అధికారపత్రాన్ని తీసుకువచ్చింది.

పురుష వేషంలో ఉన్న ఇద్దరు ఆడవాళ్లతోపాటు గోణికాపుత్రుణ్ని కూడా బంధించి, రాజు ముందు ప్రవేశపెట్టాలని ఆ శాసనంలో ఉంది.

యోగిని ఆ శాసనం సహాయంతో, ముగ్గురినీ బంధించింది. ఒక బండిలో కూర్చుండబెట్టి వారిని రాజధానికి తరలించే పనిలో ఉంది. వారి ప్రయాణం ఒక అడవి మార్గం గుండా సాగింది. ఆ అడవిలో ఒకచోట యోగిని బండిని ఆపించింది.

బండి నడిపేవాడితోనూ, తోడుగా వచ్చిన ఇద్దరు భటులతోనూ యోగిని రహస్యంగా కొన్ని మాటలు చెప్పింది.

''బాబులూ! ఇక్కడికి దగ్గరలో ఢాకినీ దేవత ఆలయం ఉంది. ఆ దేవికి ఒక చక్కని వేశ్యాపుత్రికను బలి ఇస్తే దేవి సంతోషించి నాకు వరాలిస్తుంది. వీళ్లిద్దరిలో ఒక బుల్లెమ్మని నేను బలిస్తాను. మరో అమ్మాయిని న్యాయంగా అయితే రాజుకు సమర్పించాలి. కానీ నాకు ఇంతగా సహకరించిన మీకంటే రాజు ఎక్కువ వాడు కాదు. కాబట్టి ఆ బుల్లెమ్మలలో ఒక బుల్లెమ్మతో మీరు ఆనందంగా గడపండి. ఆ కుర్రవాణ్ని చెట్టుకు కట్టేయండి'' అని బోధించింది.

భటులిద్దరూ రతిమంజరిని బలవంతం చేయసాగారు. బండివాడు గోణికాపుత్రుణ్ని చెట్టుకు కట్టేసి, అక్కడే కాపలా ఉన్నాడు. చిత్రసేనను పెడరెక్కలు విరిచికట్టి ఢాకినీ దేవత ఆలయంలోకి తీసుకుపోయింది యోగిని.

జరుగుతున్నదంతా చూసి, గోణికాపుత్రునికి రక్తం మరిగిపోసాగింది. కానీ క్షాత్రమున్న క్షత్రియుడు కానందువల్ల జంకుతున్నాడు. ఆపద గట్టెక్కించమని ప్రార్థించి, నృసింహ మంత్రాన్ని ఎడతెరిపి లేకుండా ఉపాసించసాగాడు.

కొంతసేపటికి తెలియకుండానే అతనిలో మార్పు వచ్చింది. నృసింహుడే అతణ్ని పూనినట్లయింది. ఉన్నపాటున కట్టుతాళ్లు సడలించుకున్నాడు. బండివాణ్ని మెడ పిసికి చంపేశాడు. ఒక భటుని చేతిలోని కత్తిని ఊడలాక్కున్నాడు. దాంతో ఇద్దరు భటులనూ సంహరించాడు.

హుటాహుటిన ఢాకినీ ఆలయంలోకి వెళ్లాడు. ఆలయం లోపలి వాతావరణం అంతా భీతావహంగానూ, జుగుప్సాకరంగా ఉంది. ఎటుచూసినా నెత్తుటి మరకలు, కంకాళాలు పేరుకుపోయాయి. భయంకరమైన దుర్వాసన కొడుతున్నది. దేవీవిగ్రహం ఎదుట.. యోగిని ఏవో మంత్రాలు జపిస్తున్నది. చిత్రసేనను బలిపీఠం దగ్గర కట్టేసి ఉంచింది.

గోణికాపుత్రుడు తన చేతిలోని కత్తితో ఒక్కవేటున యోగిని తలనరికాడు.

మహోగ్ర సంహారమూర్తియై.. మరో నృసింహుడిలా కనిపిస్తున్న అతనికి, అక్కచెల్లెళ్లిద్దరూ పలు ఉపచారాలు చేశారు. ఆ తరువాత వేగంగా అక్కణ్నుంచి కదిలి, ధారానగరం దిశగా నడిచారు ముగ్గురూ. ■

**(వచ్చేవారం.. దత్తకుని శాపవిముక్తి)**